# జన్మ

## రావి కొండలరావు

కమలకు పదమూడో యేట పెళ్ళయింది. పెళ్ళి పీటల మీద తప్ప మళ్ళీ ఆమె తన భర్తను చూడలేదు! ఆమెకు కాపరానికి వెళ్ళే యోగ్యత ఏ పధ్నాలుగో ఏటో, పదిహేనోఏటో కలిగి వుండాల్సింది. కాని పెళ్ళయిన ఆరునెల్లకే కమల భర్త వొకరాత్రి జ్వరం వచ్చి గంటల్లో చచ్చిపోయాడు! ఆమె తండ్రి లబో దిబోమని పరుగెత్తాడు. తనతో పీటల మీద కూచున్న తన భర్త చచ్చిపోయినట్టు తెలిసింది. ఐతే, తండ్రి ఏడ్చినంతగా ఆమె ఏడవలేదు. తన భర్త తనకు మళ్ళీ కనిపించడనే ఆమె వోసారి ఏడ్చింది. తన జీవిత నాటకానికి ఇంకా నాందిగీతం పాడకుండానే తన జీవితం ముగిసి పోయిందని తెలుసుకునే జ్ఞానం ఆమెకు లేదు. ఆమె తండ్రి అల్లుడు పోయినందుకు అంత విచార పడినట్టులేదు కాని – తన కూతుర్ని పట్టుకునే భోరుమని ఏడిచాడు!

ఆమె తల్లి కూడా కమలను పట్టుకుని ధారాపాతంగా ఏడ్చింది. మధ్య మధ్య కమల కూడా కళ్ళ నీళ్ళు పెట్టుకున్నదే కాని – తనను పట్టుకుని ఈ తల్లీ తండ్రీ 'నీ గొంతు కోశాడే తల్లీ' అని ఎందు కేడుస్తున్నారో ఆమెకు అర్థంకాలేదు. చచ్చిపోయిన తన భర్త తన గొంతుకొయ్యటం ఏమిటో కూడా ఆమెకు బోధపడలేదు!

కమల చక్కని అమ్మాయి. 'ఈ అందమయినదాన్ని ఎవరు చేసుకుంటారో' అనుకునేది తల్లి. అట్లాగే కమలకు తగినవాణ్ణి తెచ్చి పెళ్ళిచేశారు. తర్వాత ఆరునెల్లకే కమల అందచందాలు అడవిలో కాసిన వెన్నెలలా – బూడిదలో పోసిన పన్నీరులా అయిపోయినయ్!

భర్త పోయిన క్షణం నుంచీ ఆమెను అంతా ఏహ్యభావంతోనే చూడసాగారు. చుట్టాలూ, ఇరుగుపొరుగువారూ అందరూ కమలంటే అదో అంటరాని వ్యక్తిగా భావించారు. కమలకు మొదట్లో ఇది తెలిసిరాలేదు. ఆమె అమాయకురాలు – అందులో చిన్నతనం. తన మొహాన తల్లి బొట్టు ఎందుకు పెట్టుకోవద్దన్నదో – పూలు ఎందుకు తురమవొద్దన్నదో – పౌడరు పూసుకుంటూవుంటే ఆ పెట్టె తీసి తండ్రి వీధిలోకి ఎందుకు విసిరేశాడో ఆమెకు అర్థమవలేదు!

"ఎందుకమ్మా – నేను పువ్వులు పెట్టుకోకూడదూ?" అన్నది.

తల్లి వినిపించుకోలేదు. కమల మళ్ళీ అడిగింది. ఆమె సమాధానం చెప్పకుండా చీరె కొంగుతో కళ్ళు వొత్తుకోవటం చూసి – తను ఎందుకని అడిగితే కళ్ళమ్మట నీళ్ళు ఎందుకు కారుస్తున్నదో కూడా కమల తెలుసుకోలేక పోయింది.

"పౌడరు రాసుకుంటూ వుంటే నాన్నగారు అవతల విసిరేశారు మరోటి కొనుక్కుంటానే అమ్మా!" అన్నది. ఈసారి రాఘవమ్మగారు అక్కణ్ణుంచి మొహం చాటుచేసుకుని వెళ్ళిపోయింది.

కమలకు మరో సందేహం పట్టుకుంది. తను అడిగిన ప్రశ్నలకు సమాధానం ఎందుకు

చెప్పరు? ఆ సందేహాలు ఎవర్ని అడగటం? ఎవరు తీరుస్తారు? - అని మరో సందేహం కూడా పట్టుకుంది. ఈ సందేహాలతో రాత్రులు ఆమెకు నిద్రపట్టేదికాదు.

భర్తపోయిన పధ్నాలుగు గడచి పదిహేనో రాత్రివేళ ఆమె ఆకాశంలోకి చూస్తూ ఆలోచించింది. తన భర్త పోయాడు. ఆయన్ను తిరిగి తను చూడలేదు. చూడకపోయినా ఫరవాలేదు. ఆయన తనతో వొక మాటా మాట్లాడలేదు. తను సరిగ్గా ఆయన మొహమన్నా చూడలేదు. అటువంటాయన పోయిన నాటి నుంచీ తన తల్లిదండ్రులు ఏదో విచారంతో కుమిలిపోతున్నారు. అందులో అమ్మ మరీనూ, ఎందుకంటే చెప్పరు. నిన్న మహలక్ష్మమ్మగారింటికి వెళ్ళబోతే ఆవిడ లోపలకు రావొద్దన్నది. తనని ఎప్పుడూ పిలుస్తూ ఆదరించే ఆమె - వొకసారి ఎందుకు రావొద్దన్నది? ఎంచాతని తను అడిగితే 'నీ భర్త పోయాడ'న్నది . తన భర్త పోతే తనని రానివ్వకపోవటం ఏమిటి? ఇవన్నీ సరేగాని - తనని సబ్బుతో ముఖం కడుక్కోనివ్వటంలేదు. ఇదివరలో తను మామూలుగా మొహం కడుక్కుంటే - "సబ్బుతో కడుక్కోరాదుటే -" అని తల్లి పోట్లాడేది. ఇదంతా అగమ్యగోచరంగా వున్నది. తర్వాత కమలకి నెమ్మదిగా నిద్ర ప్రవేశించింది.

మర్నాడు పొద్దున్నే స్నేహితురాళ్ళు కొందరొచ్చారు. వాళ్ళూ కమలా వొక ప్రాణంగా వుండేవారు.

"ఈమధ్య రాలేదేమర్రా?" అన్నది కమల. వాళ్ళు మాట్లాడలేదు.

"ఏమిటి?" అన్నది మళ్ళీ.

"మీ ఆయన పోయాడుగా - అందుకని"

కమలకు ఈ మాటతో మంటపుట్టింది. ప్రతి దానికీ భర్త పోయాడంటా రేమిటి?

అర్థం లేదు.

"పోతే?" అన్నది చికాగ్గా.

"ఇహ నీతో అంత కలిసి మెలిసి ఉండకూడదు."

"అదేమిటి? ఎవరు చెప్పారు?"

"అంతేనే కమలా! నీకు తెలీదు. భర్త పోయిన తర్వాత భార్య వితంతువుల్లోనే లెక్క" అన్నది వొక అమ్మాయి.

"అంటే?" అన్నది కమల అర్థంగాక.

"భర్త పోయినవాళ్ళను అట్లా అంటారు. వాళ్ళు కేవలం దూరంగా వుండాలి - బొట్టూ అదీ పనికి రాదు".

"అదా సంగతి" అనుకున్నది కమల.

"భర్త పోయినవాళ్ళు పోగ్గా వుండకూడదు నీకు తెలియదల్లె వుంది - జుట్టు కూడా తీయిస్తారు" - అన్నది స్నేహితురాలు.

కమల కెవ్వుమన్నది - "నిజంగానా?"

"నిజమేకాని - నీకు ఏంచేస్తారో తెలీదు."

కమలకు తల తిరిగిపోయింది. మూర్ఛ వచ్చినంత పనయింది. కాస్సేపు స్పృహ తప్పింది కూడా.

కమలకు తెలివొచ్చి చూసుకున్నాక స్నేహితురాళ్ళెవరూ కనిపించలేదు. తన భర్త పోవటంలో వున్న ఘోరం ఏమిటో ఇప్పుడు తెలిసింది కాస్త!

• • •

కమలకు పదహారో యేడు ప్రవేశించింది. బంగారం లాంటి వొళ్ళూ, నల్లగా నిగనిగలాడే జుట్టు చూట్టానికి 'చాలా' అందగత్తెగా కనిపిస్తున్నది.

"ఆ మొహానికి బొట్టు పెట్టుకుంటే నా తల్లి ఇంకెంత శోభగా వుండేదో" అనుకుని విచారించేది తల్లి

కమలతో కలసి మెలిసి తిరిగిన అమ్మాయిలు సుఖంగా కాపురం చేస్తున్నారు. కొందరికి పిల్లలు కూడా కలిగారు. ఇవన్నీ చూస్తూ కమల దుఃఖంతో కుమిలిపోయేది. ఆ మధ్య కమల తండ్రి తన చెల్లెల్ని తీసుకొచ్చి తన ఇంట్లో పెట్టుకున్నాడు. ఆవిడ వో కన్ను ఎప్పుడూ కమల వేపే వుంచేది.

ఒకనాడు ఆవిడ వసారాలో పడుకుని కమలను పిలిచింది. కమల పలకలేదు.

" ఏం చేస్తున్నావే?"

కమలకు ఆ సమయంలో ఏదో గుర్తొచ్చి గోడకేసి తిరిగి కన్నీళ్ళు కారుస్తున్నది. బొంగురు గొంతుతో "ఏంలేదు" అన్నది.

"ఏం లేకపోవటమేమిటి? వెధవ ఏడుపూ నువ్వూనూ - ఈ కొంపకు దరిద్రం వేరే తేనక్కరలేదు. లేచి కంచాలూ, పీటలూ వెయ్యి, మీ నాన్న భోజనానికి వస్తున్నాడు".

" సరే " అన్నది కమల.

"సమాధానం ఇస్తావేం? ఎన్నాళ్ళ కంటే ఆర్నెల్లకు చచ్చినట్టుండకా - మీ నాన్న రానీ - ఆ పోకులు - ఆ జుట్టూ చూడు - ఎంత పొగ్గొ దువ్విందో " అని హుంకరించింది. పమిటకొంగు మొహాన కప్పుకుని కమల గదిలోకి వెళ్ళిపోయింది.

ఈ మేనత్త వచ్చిన క్షణం నుంచీ కమలకు ఆ ఇల్లు మరీ నరకమయిపోయింది. ఆవిడ జుట్టుకు నూనె రాసుకోనివ్వదు. నీళ్ళతోనన్నా మొహం కడుక్కోటానికి లేదు. పగలంతా పనిచేసి - అలసి పోయినాక - సాయంత్రం కాసిన్ని నీళ్ళు వొంటి మీద పోసుకోటానికి కూడా అభ్యంతరమే! ఈ సంగతులన్నీ అమ్మతో చెప్పి ఏడ్చింది. ఆవిడకు ఏమనటానికి హక్కులేదు. "మన ప్రారబ్ధం" అని భొళ్ళున కన్నీళ్ళు కార్చింది.

కమల పెత్తండ్రి కొడుకు ఇరవై నాలుగేళ్ళ వాడు-వొకనాడు వాళ్ళను చూడొచ్చాడు. అతనికి కొత్తగా పెళ్ళయింది. ఆ పెళ్ళికి కమలా తప్ప మిగతావాళ్ళు వెళ్ళారు. అతని భార్య చలాకీ మనిషి - పద్దెనిమిదేళ్ళుంటాయి. చూడడానికి బావుంటుంది. ఆ అమ్మాయి వొస్తూనే కమలతో స్నేహం కలిపింది. కమల మీద ఎంతో జాలి పడ్డది. తన కష్టసుఖాలన్నీ కమల ఆమెతో చెప్పింది.

"ఈ ముసలోళ్ళు మరీనమ్మా - వాళ్ళ కేం తెలుసులే! - అంతా ఖర్మ" అన్నది ఆమె. దొడ్లో మడిబట్ట ఆరవెయ్యటానికని వొచ్చిన కమల మేనత్తకు చెట్టుకింద వీళ్ళిద్దరూ మాట్లాడుకోవటం కనపడ్డది.

"ఏమర్రా! ఏమిటా ముచ్చట్లు? - వొకటే రహస్యాలు ! చూడూ అమ్మాయ్ - కొత్తగా పెళ్ళయినదానివి. దాంతో ఏమిటి? పో లోపలికి" అని - "నీకు మరి బుద్ధిరాదూ? - ఎన్నాళ్ళని చెప్పనూ?" అని కమల మీద కోప్పడ్డది. ఇద్దరూ లోపలకు వెళ్ళిపోయారు.

ఆ రాత్రి కమలకు బొత్తిగా నిద్ర పట్టలేదు. పక్కగదిలోంచి వాళ్ళిద్దరి మాటలూ - నవ్వులూ అన్నీ వింటున్నది. ఏమిటో గుసగుసమని మాటాడుకుంటున్నారు - నవ్వుకుంటున్నారు.

ఇవన్నీ వింటున్న కమల - తలక్రిందున్న పాత చీరెలో తల దూర్చుకుని - ఆ చాపమీద కుమిలి పోయింది.

మర్నాడు ఉదయం మేనత్త నదికి స్నానానికి వెళ్ళింది. కమల తల్లి ఎక్కడో పనిచేసుకుం టున్నది. నిన్న చెట్టు కింద ఆ అమ్మాయి కమలతో "నువ్వు చాలా అందగత్తెవు వొదినా" అన్నది. ఆ మాట నిజమో కాదో కమలకు తెలిసి రాలేదు. అందులో నిజం ఎంతవరకు వుందో పరీక్షించ దల్చుకుని - నెమ్మదిగా అద్దం తీసి తన మొహం చూసుకున్నది. ఆ మొహంలో విచార రేఖలు తప్ప ఇంకేం కళంకాలూ లేవు. ఆ మొహం ఆమెకే ఆశ్చర్యం కలిగించింది - గర్వపడ్డది - తను 'అందగత్తె' అనుకుని - ఆ అద్దంలో చిరునవ్వు నవ్వింది. క్షణకాలంలోనే అద్దంలోని చిరునవ్వు మాయమయి పోయి - విచారంతో కూడిన మొహం కనిపించి - క్రమేణా కన్నీళ్ళు ఆ మొహం మీంచి కారి - ఆ అద్దం మీద రాలాయి.

"ఏం వొదినా - ఏడుస్తున్నావ్?" అన్నదా అమ్మాయి నెమ్మదిగా.

లోకంలో తనమీద జాలిపడ్డవాళ్ళెవరన్నా వుంటే ఈ అమ్మాయి వొక్కత్తే అనుకుని కమల - "ఏంలేదు" అన్నది.

"ఏం లేకపోవటమేమిటి? వూరికే ఏడవకు వొదినా! నాకు తెలుసు నీ ఏడుపుకి కారణం. ఏంచెస్తాంచెప్పు-నీఅందం కేవలం వృథాకదా-వూరికే ఏడుస్తూవుంటే ఏమవుతుంది? ఇప్పటికేచాలా నీరసించిపోయావు. వూరుకో మరి - " అని ఆమె తన చీరె కొంగుతో కమల కన్నీళ్ళు తుడిచింది. కమలకు ఇంకా దుఃఖం పొంగిపోయింది. ఒక్కసారి 'వొదినా' అని ఆమెను కౌగిలించుకుని ధారాపాతంగా ఏడ్చింది.

ఆ సాయంత్రం వాళ్ళు తిరిగి వెళ్ళిపోయారు. కమల జీవితం మీద సానుభూతి చూపించిన ఆ వొక్క ప్రాణి కూడా కమలకు దూరమయిపోయింది. వెళ్ళేటప్పుడు ఎన్నో మాటలు చెప్పి ఆమె కూడా ఎందుకో ఏడ్చింది! ఆమె వెళ్ళిపోయిన తర్వాత ఆ యిల్లు మళ్ళీ నరకం కంటే హీనంగా కనిపించింది కమలకు.

ఎప్పుడో ఆకులు పారెయ్యటానికో - దేనికో వీధిలోకి రావటం తప్ప ఇహ వీధిమొహం చూట్టానికే కరువయ్యేది కమలకు. పొద్దున్న ఐదింటికి లేచి స్నానం చేసి ఎద్దుకంటే హీనంగా ఇంట్లో పనంతా చేసి చేసి - రాత్రి పది గంటలకు పక్కజేరటం తప్ప - ఇంకో కార్యక్రమం అంటూ లేదు. కాస్త తీరుబడి చేసుకుని - ఏ పుస్తకమన్నా చదువుకుందా మనుకుంటే ఆ మేనత్త కస్సుమంటుంది. కమలకు పగలంతా విరామం లేకుండా పని - దానికి తోడు ఎప్పుడూ విచారం - విచారంతో సరిగ్గా భోంచెయ్యక పోవడం వీటివల్ల ఆమె పూర్తిగా నీరసించి పోయింది.

ఆ వూరికి వొకనాడు ఒక మంచి సినిమా వొచ్చింది. కమల ఇంట్లో వాళ్ళంతా బయల్దేరాడు మేనత్తతో సహా. ఐతే కమల మాత్రం కదలటానికి లేదు. ఆ మేనత్త వొక శాసనం చేసిపారేసింది. "చచ్చినట్టు ఇంట్లో పడుండక సినిమాలూ, నాటకాలూనా దీనికి! దీని బతుకు బద్దలవా-" అని రంయ్‌మని ఆడిపోసింది.

"పోనీ వుండిపోతుంది లెండి" అన్నది కమల తల్లి.

"వొక్కత్తెనూ ఇంట్లో పెట్టి పోతామే?- అమ్మో? తలుపు బయట తాళం పెట్టి మరీ పోవాలి." అన్నది మేనత్త హుంకరిస్తూ.

ఈ మాటకు కమల గతుక్కుమన్నది. తనను సినిమాకు రానివ్వకపోతే ఏమోగాని ఈ

బందిఖానా ఏమిటి? తను కేవలం జంతువు - ఇంకా చెప్పాలంటే వొరి పశువు. తనకు ఆనందం – సంతోషం అక్కర్లేదు! కమల చివాలున ఇంట్లోకి పోయింది.

"నేనుంటాను - మీరు వెళ్ళండి" అన్నాడు కమల తండ్రి.

"బావుందిరా - మొగదిక్కే లేకుండా సినిమాకా? ఏడిసినట్టుంది. తాళం పెడితే ఏం? వీధిలో దీని క్కావలసినది ఏం వున్నయ్ గనక?" అని ఏవేవో చెప్పి - వొప్పించి – బయట తాళం పెట్టించి సినిమాకు బయల్దేరించింది మేనత్తగారు.

ఇహ లోపల కమలకు తేళ్ళూ, పాములూ పాకుతున్నట్టయి - తిరగసాగింది. మొదట ఆమెను కూడా తల్లి తీసుకెళ్తా నన్నది. కాని, మేనత్త వల్ల అది జరగలేదు. తల్లి వుండిపోతానంది. ఆవిడ ఒప్పలేదు. ఆడదాన్ని వొక్కత్తెనూ పోలేనన్నది. అందుకని తల్లీ, తండ్రీ, మేనత్తా బయలుదేరారు.

కమల మంచం మీద పడుకుని వొకటే ఏడవసాగింది. తను ఎమిటి చేసింది? తను వొక్క సినిమా అన్నా చూసిందా? తనకు కనీసం వీధి గుమ్మమన్నా దాటటానికి లేకుండా పోతున్నదే - తను మాత్రం ప్రాణికాదా? తనకు మాత్రం సినిమాలూ అవీ చూసి ఆనందించాలని లేదా? ఈ జీవితంలో ఆనందం ఎట్లాగూ లేదు - కనీసం ఈ ఆనందాన్ని పొందటానికన్నా తనకు హక్కు లేదా? తన బ్రతుకు ఏమిటి ఇట్లా ఇప్పుడే నట్టేట కలిసిపోయింది? ఈ పాడు జీవితం - ఈ జైలు బ్రతుకూ ఎందుకు తనకు? తనతోటి వాళ్ళు ఎంత ఆనందంగా వుంటున్నారు?-

కమలకు తోచలేదు. తనకు భగవంతుడు చావన్నా తెచ్చిపెట్టాడుకాదు – గోడకేసి తల బద్దలు కొట్టుకుని కంటికీ మంటికీ ఏడ్చింది కమల. ఆ దుఃఖం ఆగటం లేదు!

ఆ మర్నాడు కమల వొక్కత్తే ఏమో ఆలోచించ సాగింది. వొంటరిగా చెట్టుకింద గంటలు తరబడి కూచుని పిచ్చిదానికి మల్లే చూడసాగింది.

ఆమెను చూస్తే అందరికీ అసహ్యమే. చుట్టు పక్కల వాళ్ళూ, ఇరుగుపొరుగువాళ్ళూ - స్నేహితులు - బంధువులు - చివరకు తల్లి తండ్రి కూడా ఆమె మీద ఏహ్యభావాన్ని చూపుతున్నారు. ఈ విషయాన్నే కమల చర్చించుకున్నది. తనమీద ఇంత కక్ష ఏమిటి వీళ్ళకు? తనకు పెళ్ళీ పేరంటం అంటూ లేవు - ఈ జీవితంలో ఆనందమన్నది ఏ కోశానా లేదు. పైగా పొద్దుటి నుంచీ సాయంత్రం దాకా బండెడు చాకిరీ. ఇంత చేస్తున్నా తిట్లూ చివాట్లూ తప్పవు. ఈ దరిద్రపు బ్రతుకు ఇంకెన్నాళ్ళు తనకు? - రెండు చేతులూ ఎత్తి కమల దేవుడికి నమస్కారం పెట్టింది!

మర్నాడు తెల్లారేసరికి ఆ ఇంట్లో భోరున ఏడుపులూ, కేకలూ వినిపించసాగినయ్. కమల తల్లి 'లబో' మని గుండె బాదుకుని ఏడుస్తున్నది. తండ్రి వో మూల కొయ్యబారిపోయినాడు. వాకిట్లో కమల శరీరం చలనం లేకుండా పడివుంది. నిండు యౌవనంతో తొణికిసలాడుతూ - జీవిత మాధుర్యాన్ని రుచే చూడని కమల - ఆ క్రిందటి రాత్రి సమాజం పెడుతున్న ఆంక్షల్ని భరించలేక - తనవల్ల సంఘమూ, బంధువులూ పొందుతున్న ఆవేదన, అసహ్యమూ చూడలేక - బావిలో పడి ఆత్మహత్య చేసుకున్నది.

కమల చావు విన్న లోకం - చుట్టూ వున్న సమాజమూ ఆమె మీద ఏ మాత్రం సానుభూతి చూపలేదు సరికదా - తమలోంచి వో అంటరాని మలిన కీటకం వెళ్ళిపోయిందని సంతోషించినయ్! ఐతే కమల ఆత్మహత్య చేసుకోలేదని – తనే ఆమెను 'ఘోరహత్య' చేశానని ఆ సంఘం భావించలేదు!. ✸

ఆంధ్రప్రభ సచిత్రవార పత్రిక, 1-4-1953.